## ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి : అదనపు కలెక్టర్



ఆలేరు రూరల్ : కొలనుపాకలో ధాన్యం పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

ఆలేరు రూరల్/ వలిగొండ, మే 23 : ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి సూచించారు. ఆలేరు మండలంలోని కొలనుపాకలో, వలిగొండ మండలం గోకారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. అనంతరం రిజిష్టర్లను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని, తూకం వేసిన బస్తాలను వెంటనే మిల్లులకు తరలించాలని అన్నారు. కార్యక్రమాల్లో తాసీల్దార్లు ఆంజనేయులు, దశరథ నాయక్, ఏపీఎం జానీ, ఏఈఓ శివకుమార్, సెంటర్ ఇన్‌చార్జి మధు పాల్గొన్నారు.

### తాసీల్దార్ కార్యాలయంలో తనిఖీ

గుండాల : తాసీల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అంతకుమందు బురుజుబావి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను పరిశీలించారు. 16 ఇండ్ల నిర్మాణం ప్రారంభం కాగా, అందులో నాలుగు ఇండ్లు బేస్‌మెంట్ లెవెల్ పూర్తి చేసుకున్నాయని తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో జూన్ 2న మంజూరు పత్రాలు ఇచ్చిన తర్వాత ఇండ్లను ప్రారంభించనున్నట్లు చెప్పారు. పర్యవేక్షణకు మండలానికి ఒక ఏఈని నియమించినట్లు తెలిపారు.

# జిల్లాలో 2.83 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు

- కలెక్టర్ హనుమంతరావు



శివారెడ్డిగూడెంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కలెక్టర్ హనుమంతరావు

భూదాన్ పోచంపల్లి, మే 23 : జిల్లాలో 2.83 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, మరో 46వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వచ్చే అవకాశం ఉందని కలెక్టర్ హనుమంతరావు తెలిపారు. మండలంలోని జూలూరు, ముక్తాపూర్, శివారెడ్డిగూడెం, జిబ్లక్‌పల్లి, దంతూరు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. జాలి మిషన్లు పనిచేయడం లేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సాయంత్రం వరకు జాలి మిషన్లు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లారీలను సరిపడా పంపాలని, వచ్చిన ధాన్యాన్ని వెంటనే దిగుమతి చేయాలని రైస్ మిల్లు యజమానులకు సూచించారు. రైతులకు ఇబ్బంది కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలో 370 కొనుగోలు కేంద్రాలకు గాను 110 సెంటర్లు క్లోజ్ అయ్యాయన్నారు. సుమారు పది కేంద్రాల్లో ధాన్యం ఎక్కువ ఉన్నందున ఈ నెల 27వరకు కొనుగోళ్లు పూర్తి చేస్తామని, రైతులు అధైర్యపడవద్దని సూచించారు. వర్షాల నేపథ్యంలో అధికారులు, రైతులు రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలన్నారు. ధాన్యం కొనుగోలు చేసిన 48 గంటల్లో రైతుల ఖాతాలో డబ్బులు జమ అవుతున్నాయని తెలిపారు. ఇప్పటి వరకు రూ.550 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేశామని, ట్యాబ్ ఎంట్రీ, టెక్నికల్ సమస్యతో 30 కోట్ల రూపాయలు జమ కాలేదని చెప్పారు. తడిసిన ప్రతి గింజనూ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందన్నారు. తాసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఏఓ శైలజ, జూలూరు పీఏసీఎస్ చైర్మన్ అందెల లింగంయాదవ్, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, ఏఈఓ నరేశ్, ఏఎస్‌ఓ రోజా, డీటీ సీఎస్ బాలమణి పాల్గొన్నారు.



యాదగిరిగుట్ట : నూతన వధూవరులతో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ మహేందర్‌రెడ్డి, నాయకులు

## వధూవరులకు మాజీ మంత్రి హరీశ్‌రావు ఆశీర్వాదం

యాదగిరిగుట్ట, మే 23 : భువనగిరి మండలం వీరవెల్లి గ్రామంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జరిగినన యాదగిరిగుట్ట మండలం దాతారుపల్లి మాజీ ఎంపీటీసీ కాల్నె అయిలయ్య కూతురు వివాహానికి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్ హాజరయ్యారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహ వేడుకల్లో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ ఇమ్మడి రామిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గడ్డమీది రవీందర్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ తోటకూరి అనూరాధ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### కూనూరు మాజీ సర్పంచ్ సోదరుడి వివాహానికి హాజరు

భువనగిరి కలెక్టరేట్, మే 23 : మండలంలోని రాయగిరి గ్రామ పరిధిలోని జీపీఆర్ గార్డెన్‌లో శుక్రవారం జరిగిన కూనూరు గ్రామ మాజీ సర్పంచ్ అంకర్ల మురళీకృష్ణ సోదరుడి వివాహానికి మాజీ మంత్రి హరీశ్‌రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. వివాహానికి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్యామ మల్లేశ్, రాష్ట్ర నాయకులు జడల అమరేందర్‌గౌడ్, కొలుపుల అమరేందర్, మండల, పట్టణ అధ్యక్షులు జనగాం పాండు, కిరణ్‌కుమార్, స్థానిక నాయకులు హాజరయ్యారు.



భువనగిరి కలెక్టరేట్ : వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నేత క్యామ మల్లేశం, నాయకులు

## ఆదినాథ్ భగవాన్ కంటి నుంచి నీరు



ఆదినాథ్ భగవాన్ విగ్రహం కంటి నుంచి వస్తున్న నీరు

ఆలేరు రూరల్, మే 23 : ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో గల జైన దేవాలయంలోని తీర్థంకరుల్లో ఒకరైన ఆదినాథ్ భగవాన్ విగ్రహం కంటి నుండి నీరు బయటికి ఉబికి రావడంతో భక్తులు, పూజారులు ఆందోనకు గురయ్యారు. ఈ సంఘటన శుక్రవారం ఉదయం జరిగింది. పది సంవత్సరాల క్రితం ఇలాగే జరిగినట్లు జైన దేవాలయ పూజారులు తెలిపారు. విగ్రహం కంటి నుంచి నీరు రావడంతో ఆలయ పూజారులు శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించి పూజలు చేశారు. విగ్రహం కంటి నుంచి నీరు వచ్చిందన్న వార్త తెలిసి స్థానికులు పెద్ద సంఖ్యలో ఆలయానికి వచ్చి చూశారు.

## విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలి

- డీఈఓ సత్యనారాయణ



శిక్షణలో మాట్లాడుతున్న డీఈఓ సత్యనారాయణ

రాజాపేట, మే 23 : ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న మెళకువలకు అనుగుణంగా విద్యార్థులకు మెరుగైన బోధన అందించాలని జిల్లా విద్యాధికారి సత్యనారాయణ సూచించారు. రాజాపేట బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ ట్రైనింగ్‌ను క్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శిక్షణను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు మెరుగైన విద్య అందించాలన్నారు. ఉపాధ్యాయులు నిబద్ధతతో విధులు నిర్వహించాలని, విద్యార్థులకు నైతిక విలువలతో కూడిన నాణ్యమైన విద్య బోధించాలని సూచించారు. విద్యార్థులు గణిత పరిక్రియలు సులభంగా నేర్చుకునేలా ప్రోత్సహించాలన్నారు. అందుకు అనుగుణంగా బోధనా మెళకువలను ఈ శిక్షణ ద్వారా నేర్చుకోవాలని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలను తనదిగా భావించి విద్యార్థుల నమోదును పెంచాలని సూచించారు. మండల విద్యాధికారి చందా రమేశ్ మండలంలో జరుగుతున్న బడిబాట కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఎం.శశికుమార్, జె.ప్రభాకర్, ఎమ్మార్పీలు ఎన్.భరత్, జె.కరుణాకర్, జె.మహేందర్, ఎస్.శ్రీధర్, కె.నరేశ్, రాజేశ్వరి, కె.సరిత పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి.. మరొకరికి గాయాలు

చౌటుప్పల్, మే 23 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా.. మరొకరు గాయాల పాలయ్యారు. ఈ సంఘటన చౌటుప్పల్ పట్టణంలోని వలిగొండ క్రాస్ రోడ్డు సమీపంలో శుక్రవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని అల్లాపురం గ్రామానికి చెందిన గూడూరు బుచ్చిరెడ్డి (59), తన స్నేహితుడు పక్కీరు అల్వాల్‌రెడ్డి శుక్రవారం బైక్‌పై చౌటుప్పల్‌లోని ఎస్‌ఎంఆర్ ఫంక్షన్ హాల్‌లో వివాహానికి వెళ్తున్నారు. ఈ క్రమంలో వెనుక నుంచి అతివేగంగా వచ్చిన లారీ ట్యాంకర్ బైక్‌ను ఢీకొట్టింది. దాంతో ఇద్దరూ కిందపడ్డారు. బుచ్చిరెడ్డి పైనుంచి ట్యాంకర్ వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అల్వాల్‌రెడ్డికి గాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ దవాఖానకు తరలించారు. సీఐ మన్మథకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### ముగ్గురు చైన్‌స్నాచర్లకు రిమాండ్

చౌటుప్పల్, మే 23 : ముగ్గురు చైన్‌స్నాచర్లను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ మన్మథకుమార్ తెలిపారు. వారి వద్ద ఐదు గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. ఈ నెల 21న చౌటుప్పల్ మండలం కైతాపురం గ్రామానికి చెందిన వృద్ధురాలు గోపనబోయిన యశోద మెడలో తులంన్నర బంగారు గొలుసును గుర్తుతెలియని దుండగులు అపహరించుకుపోయారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దొంగతనానికి పాల్పడింది సూర్యాపేట జిల్లా కోదాడ మండలం శ్రీనివాసనగర్‌కు చెందిన ఇటుకల పణిచందు, అదే ప్రాంతానికి చెందిన రెడపంగ అభిషేక్, మేడ్చల్ జిల్లా మల్కాజిగిరి యాదవ్‌నగర్‌కు చెందిన గుడాల తిరుమల్‌గా గుర్తించారు. వారిని రంగారెడ్డి జిల్లా సరూర్‌నగర్‌లోని ఓ లాడ్జిలో పట్టుకొని రిమాండ్‌కు తరలించనట్లు సీఐ తెలిపారు. వీరు రెండు నెలల క్రితం మిర్యాలగూడ, నల్లగొండలో చోరీలకు పాల్పడినట్లు సమాచారం.

### విద్యుదాఘాతంతో ఐదు పాడి గేదెలు మృతి

రామన్నపేట, మే 23 : మండలంలోని శోభనాద్రిపురం గ్రామంలో విద్యుదాఘాతంతో ఐదు పాడి గేదెలు మృతిచెందాయి. బాధిత రైతులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని జక్కల అయిలయ్యకు చెందిన మూడు గేదెలు, జక్కల మహేశ్‌కు చెందిన ఒకటి, బొల్లపల్లి సత్తయ్యకు చెందిన ఒక గేదెను రోజు మాదిరిగా శుక్రవారం బొడిగే లక్ష్మయ్య వ్యవసాయ భూమిలో మేపుతున్నారు. ప్రమాదవశాత్తు విద్యుత్ వైరు తెగి పడటంతో షాక్ తగిలి ఐదు గేదెలు అక్కడికక్కడే మృతిచెందాయి. విషయం తెలుసుకున్న ఆర్‌ఐ శోభ, విద్యుత్ ఏఈ కోటేశ్వర్‌రావు సంఘటన స్థలానికి వచ్చి పంచనామా నిర్వహించారు. ఒక్కో బర్రె విలువ లక్షన్నర రూపాయలు ఉంటుందని, తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు కోరుతున్నారు.

## ఐలయ్యా.. నోరు అదుపులో పెట్టుకో..

- బీఆర్‌ఎస్ రాజాపేట మండలాధ్యక్షుడు తిరుమలేశ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు తిరుమలేశ్

రాజాపేట, మే 23 : ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని, కేసీఆర్, కేటీఆర్‌పై మాట్లాడే నైతిక హక్కు ఆయనకు లేదని బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సట్టు తిరుమలేశ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకుల సహనాన్ని పరీక్షించవద్దని, తాము కన్నెర్ర చేస్తే కాంగ్రెస్ నాయకులు గ్రామాల్లో తిరిగే పరిస్థితి ఉండదని హెచ్చరించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయడానికి చేతగాక ప్రతిపక్షాలపై నోరు పారేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీని ప్రజలు గమనిస్తున్నారన్నారు. అడ్డమైన భాషతో మాట్లాడడం సరికాదని పేర్కొన్నారు. అధికారాన్ని దుర్వినియోగం చేసున్న సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో సబ్బండ వర్గాల ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. కాంగ్రెస్ నాయకుల నోటిని హార్పిక్‌తో కడుగాలన్నారు. నోటి దూల కాదు.. నిరుద్యోగులకు ఉద్యోగాల నోటిఫికేషన్స్ ఇవ్వాలని హితవు పలికారు. అందాల పోటీలు కాదు.. అన్నదాతల ఆత్మహత్యల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. ఇకనైనా ప్రజలకు మేలు చేసే పనులు చేయాలని సూచించారు. లేకుంటే ప్రజాక్షేత్రంలో ఓటమి తప్పదని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ గోపగాని బాలమణి, పీఏసీఎస్ చైర్మన్ చింతలపూరి భాస్కర్‌రెడ్డి, నాయకులు సందిల భాస్కర్, జశ్వంత్, బూర్గు నర్సిరెడ్డి, ఎస్కే కరీం, ఉప్పలయ్య, వీరేశం, పాండు, రాజు, చంద్రయ్య, బాలకృష్ణ, యాదగిరి, ధర్మారెడ్డి, రవి పాల్గొన్నారు.

## వైకుంఠధామం పనులను సత్వరమే పూర్తి చేయాలి

మోత్కూరు, మే 23 : మున్సిపాలిటీలో అసంపూర్తిగా ఉన్న వైకుంఠధామం పనులను సత్వరమే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి ఆదేశించారు. వైకుంఠధామాన్ని శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2022లో వైకుంఠధామం నిర్మాణానికి రూ.కోటి మంజూరు చేయగా.. కాంట్రాక్టర్ పనులను పూర్తి చేయకుండా వదిలేశారు. పబ్లిక్ హెల్త్ ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ కొరవడి నాణ్యత లేకుండా నిర్మించిన సీసీ రోడ్డును అదనపు కలెక్టర్ పరిశీలించారు. మిగిలిపోయిన సీసీ రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఆక్రమణకు గురైన వైకుంఠధామాన్ని సంరక్షించడం కోసం సర్వే చేసి హద్దులను ఏర్పాటు చేయించాలని తాసీల్దార్ జ్యోతిని ఆదేశించారు. ప్రజలను ఆహ్లాదం పరిచేలా మొక్కలను పెంచాలని, ప్రహరీ వెంట వైకుంఠధామంలో కోనోకార్పస్ చెట్లను పెంచాలని మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్‌కు సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ పబ్లిక్ హెల్త్ ఏఈ సురేశ్, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుమన్, మున్సిపల్ మేనేజర్ ప్రభాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి : సీపీఐ



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు

యాదగిరిగుట్ట, మే 23 : కేంద్ర ప్రభుత్వం ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు డిమాండ్ చేశారు. మావోయిస్టులను చర్చలకు ఆహ్వానించి సానుకూలంగా పరిష్కరించాలన్నారు. మండలంలోని చిన్న కందుకూరు గ్రామంలో సీపీఐ మండల కార్యదర్శి పేరబోయిన మహేందర్, మహిళా సమాఖ్య మండల ప్రధాన కార్యదర్శి ఆరె పుష్ప అధ్యక్షతన శుక్రవారం జరిగిన పార్టీ 18వ మహాసభలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఓట్లు, సీట్లతో సంబంధం లేకుండా ప్రజా సమస్యలే ఏజెండాగా నిత్యం ప్రజల మధ్య నిలబడి పోరాడే పార్టీ సీపీఐ అన్నారు. నిత్యావసర సరుకుల ధరలు అకాశాన్నంటుతుంటే పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని కోరారు. మహాసభలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కళ్లెం కృష్ణ, మహిళా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి బండి జంగమ్మ, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి రాజయ్య, ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి చెక్క వెంకటేశ్, సీపీఐ జిల్లా సమితి సభ్యుడు బబ్బూరి శ్రీధర్, మండల కార్యదర్శి కళ్లెపల్లి మహేందర్ పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్లను రెండ్రోజుల్లో పూర్తి చేయాలి : ఆర్డీఓ



మానాయికుంటలో కొనుగోలు కేంద్రం నిర్వాహకులతో మాట్లాడుతున్న ఆర్డీఓ కృష్ణారెడ్డి

అడ్డగూడూరు, మే 23 : ధాన్యం కొనుగోళ్లను రెండ్రోజుల్లో పూర్తి చేయాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి అన్నారు. మండల కేంద్రంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు వచ్చే అవకాశం ఉన్నందున అన్ని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. మిల్లుల్లో త్వరగా అన్‌లోడ్ అయ్యేలా చూసుకోవాలన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని సూచించారు. ఆయన వెంట తాసీల్దార్ శేషగిరిరావు, ఏఓ పాండురంగాచారి, ఏఈఓ నవనీత, ఆర్‌ఐ ఉపేందర్, పీఏసీఎస్ సీఈఓ వెంకటేశ్వర్లు ఉన్నారు.

## వచ్చే నెల 9నుంచి సీపీఎం జిల్లా రాజకీయ శిక్షణ తరగతులు



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

యాదగిరిగుట్ట, మే 23 : వచ్చే నెల 9, 10, 11 తేదీల్లో యాదగిరిగుట్టలో సీపీఎం జిల్లాస్థాయి రాజకీయ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్ తెలిపారు. శుక్రవారం యాదగిరిగుట్టలో జరిగిన పార్టీ పట్టణ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న ప్రజా, కార్మిక, విద్యార్థి, యువజన వ్యతిరేక విధానాలపై భవిష్యత్ కార్యాచరణ రూపొందించనున్నట్లు వెల్లడించారు. రాజకీయంగా పార్టీ నాయకత్వాన్ని చైతన్యం చేయడం కోసం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కల్లూరి మల్లేశం, మండల కార్యదర్శి బబ్బూరి పోశెట్టి, జిల్లా కమిటీ సభ్యుడు గడ్డం వెంకటేశ్, పట్టణ కార్యదర్శి భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

## విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ సతీశ్‌కుమార్



మున్సిపల్ ఉద్యోగులతో సమీక్ష చేస్తున్న కమిషనర్ సతీశ్‌కుమార్

మోత్కూరు, మే 23 : మున్సిపల్ ఉద్యోగులు విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ కె.సతీశ్‌కుమార్ హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు జూన్ 2నుంచి సెప్టెంబర్ 9వరకు 100 రోజుల పాటు మున్సిపాలిటీలో చేయవలసిన పనుల గురించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వీధి దీపాల పనులు సక్రమంగా నిర్వహించాలన్నారు. మేనేజర్ ప్రభాకర్, ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రవణ్, వార్డు ఆఫీసర్లు పాల్గొన్నారు.

## కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించం

- బీఆర్‌ఎస్ ఆలేరు మండల, పట్టణ అధ్యక్షులు శ్రీనివాస్, మల్లేశం గౌడ్



23ఎఎల్‌ఆర్20 : విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

ఆలేరు టౌన్, మే 23 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు గంగుల శ్రీనివాస్, పుట్ట మల్లేశం గౌడ్ హెచ్చరించారు. పట్టణంలోని రహదారి బంగ్లాలో శుక్రవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన 420 హామీలను అమలు చేయలేక ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. ప్రభుత్వాన్ని విమర్శించిన కేటీఆర్ నోటిని యాసిడ్‌తో కడుగుతాననడం హేయమైన చర్య అని మండిపడ్డారు. పోలీసులు సూమోటోగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ నాయకులపై అడ్డగోలుగా మాట్లాడితే కాంగ్రెస్ నాయకులను ప్రజలు గ్రామాల్లో ఉరికించి కొడుతారని హెచ్చరించారు. ఏడాదిన్నరలో ఎమ్మెల్యే ఐలయ్య నియోజకవర్గ అభివృద్ధికి ఒక్క రూపాయి తీసుకురాలేదన్నారు. రైల్వే అండర్ పాస్ కోసం గతంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీత నిధులు తీసుకొస్తే.. ఆ పనులను ప్రస్తుత ఎమ్మెల్యే పూర్తి చేయించకపోవడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యేకు దమ్ము ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపించాలని సవాల్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల సెక్రటరీ జనరల్ రచ్చ రామనర్సయ్య, నాయకులు మొరిగాడి వెంకటేశ్వర్లు, ఆడెపు బాలస్వామి, శంకర్, నాగరాజు, మహేందర్‌రెడ్డి, రామ్‌ప్రసాద్, రాములు, రామన్ పాల్గొన్నారు.

## ప్రతి శుక్రవారం 'డ్రై డే' నిర్వహించాలి : డీఎంహెచ్‌ఓ



వంగపల్లి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి మనోహర్

యాదగిరిగుట్ట, మే 23 : ప్రతి శుక్రవారాన్ని 'డ్రై డే'గా నిర్వహించి గ్రామాల్లో అన్ని నీటి నిల్వలను శుభ్రం చేయాలని ఆయుష్మాన్ ఆరోగ్య సిబ్బందికి జిల్లా వైద్యాధికారి డాక్టర్ మనోహర్ సూచించారు. డ్రైడే చేపట్టడంతో మలేరియా, ఇతర బ్యాక్టీరియాకు చెందిన లార్వా ఉత్పత్తిని అరికట్టవచ్చన్నారు. మండలంలోని వంగపల్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రం, యాదగిరిగుట్ట, రాజాపేట, శారాజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, రాజాపేట మండలంలోని బొందుగుల, ఆలేరు మండలంలోని కొలనుపాక, ఆలేరు-1, ఆలేరు-2 ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో శుక్రవారం ఆయన ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. కాయకల్ప అంతర్గత సంసిద్ధత కార్యక్రమాలు ఎంపిక చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల్లో సిబ్బంది పనితీరును, కేంద్రాల్లో నిర్వహిస్తున్న రిజిష్టర్లు, ఆరోగ్య సేవల అమలును పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాల అమలు పురోగతిపై ఆరోగ్య సిబ్బందితో సమీక్షించారు. గర్భిణులకు ప్రాథమిక వైద్య పరీక్షలు, తప్పనిసరిగా నాలుగు సందర్శనల నమోదు, టీటీలు, రక్తహీనత నివారణకు ఐరన్ మాత్రలు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రానికి చెందిన ఏఎన్‌ఎం, ఇతర సిబ్బంది తమ శాఖలను ముందుగానే సిద్ధం చేసుకోవాలని సూచించారు. దోమల ద్వారా వ్యాప్తి చెందే వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. క్షేత్ర సిబ్బంది ఇంటింటికీ తిరిగి ఎంఎఫ్ రిజిష్టర్లలో నమోదు చేయాలని ఆదేశించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలను పెంచేందుకు కృషి చేయాలని సూచించారు. ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు తమ పరిధిలో గల గర్భిణులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

## 'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'



సమావేశంలో మాట్లాడుతున్న గణపతిరెడ్డి

ఆత్మకూరు(ఎం), మే 23 : గ్రామ పంచాయతీ సిబ్బంది, ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పైళ్ల గణపతిరెడ్డి అన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ సిబ్బందితో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పంచాయతీ సిబ్బందికి కనీస వేతనం నెలకు రూ.18వేలు ఇవ్వాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేసి ప్రతి నెలా ట్రెజరీ ద్వారా 1వ తేదీన వేతనాలు అందివ్వాలని డిమాండ్ చేశారు. అర్హులైన కారోబార్లు, బిల్ కలెక్టర్లను పంచాయతీ సహ కార్యదర్శులుగా నియమించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. సంఘం రాష్ట్ర కన్వీనర్ యాదమ్మ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భిక్షం, ఈశ్వర్, జిల్లా ఉపాధ్యక్షుడు నోముల స్వామిగౌడ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు కూరెళ్ల కిష్టయ్య, జ్ఞానేశ్వర్, శ్రీను, యాదయ్య, లక్ష్మయ్య, రమేశ్, ఉప్పలమ్మ, సైదులు పాల్గొన్నారు.

## కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే ఐలయ్యకు లేదు

- బీఆర్‌ఎస్ గుండాల మండలాధ్యక్షుడు ఖలీల్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఖలీల్

గుండాల, మే 23 : మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శించే స్థాయి ఎమ్మెల్యే బీర్ల ఐలయ్యకు లేదనీ బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు ఎండీ ఖలీల్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసి ఆ తర్వాత ఐటీ శాఖ మంత్రిగా తెలంగాణ అభివృద్ధికి కేటీఆర్ ఎంతో కృషి చేశారన్నారు. అటువంటి నాయకుడిపై అసభ్యకరంగా మాట్లాడటం బాధాకరమని పేర్కొన్నారు. ఆ వాఖ్యలను ఎమ్మెల్యే వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని కోరారు. హామీలను నెరవేర్చకుండా ప్రజల దృష్టిని మళ్లించడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. సమావేశంలో నాయకులు మూగల శ్రీనివాస్, చెన్నారెడ్డి, బాలకృష్ణ, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేశ్, శ్రీశైలం పాల్గొన్నారు.

## తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఆత్మకూరు(ఎం), మే 23 : ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ గడ్డం దశరథగౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి నెల రోజులు గడుస్తున్నా ఇప్పటి వరకు పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి ధాన్యం మొత్తాన్ని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు యాస ఇంద్రారెడ్డి, కోరె భిక్షపతి, ఏలెందర్, వెంకన్నగౌడ్, బీరప్ప, శంకర్ పాల్గొన్నారు.

### బీబీ సాహెబ్ చెరువులో చేపల మృత్యువాత

బీబీనగర్, మే 23 : మండలంలోని రాఘవాపురం గ్రామ పరిధిలోని బీబీ సాహెబ్ చెరువులో చేపలు మృత్యువాత పడ్డాయి. చెరువులోకి రసాయన వ్యర్థ పదార్థాలు వచ్చి చేరడంతోనే చేపలు మృతిచెందాయని మత్స్య సంఘం అధ్యక్షుడు మేకల కుమారస్వామి తెలిపారు. సుమారు రూ.10 లక్షల విలువ చేసే చేపలు చనిపోయాయని, ఇలాగే కొనసాగితే మరిన్ని చనిపోయే ప్రమాదముందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

## మండల మహిళా సమాఖ్య కార్యవర్గం ఎన్నిక

బీబీనగర్, మే 23 : మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి నాగిరెడ్డి పాల్గొని ఎన్నికల నిర్వహణను పరిశీలించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులను సన్మానించారు. అధ్యక్షురాలిగా టి.ప్రజావాణి, కార్యదర్శిగా డి.బాలమణి, కోశాధికారిగా జ్యోతి ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డీపీఎం ఐబీ శ్రీనివాస్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం శ్రీనివాస్, సీసీ మల్లేశ్, మహిళా సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.



నూతన కార్యవర్గ సభ్యులతో డీఆర్‌డీఓ నాగిరెడ్డి

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

PLOT FOR SALE
★ సాగర్ హైవే, విజయవాడ హైవేలలో తక్కువ ధరలో అపార్ట్‌మెంట్ ప్లాట్లు, Indp. ప్లాట్లు & ఓపెన్ ప్లాట్లు HMDA/DTCP అప్రూవల్ LRS గల ప్లాట్లు కలవు. 9603444402.
NT-331100

PLOT FOR SALE
★ సాగర్ రోడ్‌లోగల రెయిన్‌బో వెంచర్ ఫేస్-2 నందు 300 చ।।గల తూర్పు ఫేస్ ప్లాట్ అమ్మబడును. గజం: 5,500/- రూ.లు. సంప్ర।। 9885650635, 6281714883.
NT-329532

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ప్రతి 4 లైన్ల క్లాసిఫైడ్‌కు 200/-
ప్రతి అదనపు లైన్‌కు 50/-
Note: 3+1 Scheme Available
Minimum 4 Lines,
Extra Line - Extra Amount
నమస్తే తెలంగాణ
నల్లగొండ: 9182777625, 9182777635
దేవరకొండ: 9182777635
హాలియా: 9182777059
మిర్యాలగూడ: 9182777059